క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల రీకండక్టరింగ్ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలిపారు.

◆ అపర్ణ ఫీడర్ పరిధిలోని సెంట్రల్ పార్కు, ఏఎంఆర్ గార్డెన్స్, వెంకటసాయి కాలనీ, మికాసా స్టెర్లింగ్, రాజధాని దాబా, అపర్ణ స్ప్లెలండర్, దేవేందర్‌కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు...

◆ కొంపల్లి ఫీడర్ పరిధిలోని కుమ్మరి బస్తీ, మున్సిపల్ కార్యాలయం, ఆంధ్రబస్తీ, సెంట్రల్ పార్క్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు

పైపులైన్ రోడ్డు ఫీడర్‌లో..

పైపులైన్ రోడ్డు ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ జ్ఞానేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల గ్రామం, ఎస్సీ కాలనీ, ఆర్ మ్స్‌బర్గ్, సంకల్ప హోమ్స్, మారుతి సన్‌సిటీ, శ్వేత ఆర్యన్, మిత్రహోమ్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

రంగారెడ్డినగర్: పోషణ సంబరాల్లో భాగంగా బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు చిరుధాన్యాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మి చిరు ధాన్యాల్లో ఉండే పోషక విలువలు, వాటిని తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్దా లక్ష్మినాథ్, రాధా, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ కార్యాలయాన్ని పునరుద్ధరించాలి



చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఓం ప్రకాష్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు

నిజాంపేట్: ప్రగతినగర్‌లో పోస్టాఫీస్ కార్యాలయాన్ని పునరుద్ధరించాలని నిజాంపేట్ కార్పొరేషన్ కార్పొరేటర్లు వెంకటరామయ్య, శ్రీరాములు, మార్త వాణిప్రసాద్, మాధవి, సుజాత, లక్ష్మికుమారి బుధవారం చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఓం ప్రకాష్, పోస్ట్ మాస్టర్ శ్రీలతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నోఏళ్లుగా కొనసాగుతున్న పోస్టాఫీస్‌ను బాచుపల్లికి మార్చడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

'డబుల్' ఇళ్ల పంపిణీలో స్థానికులకే 10శాతం ఇవ్వాలి

దుండిగల్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో స్థానికులకు పది శాతం ఇళ్లను కేటాయించిన తర్వాతనే మిగతా ప్రాంతాల వారికి ప్రాధాన్యం ఇవ్వాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. బుధవారం భౌరంపేట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించిన భూపతిరెడ్డి మాట్లాడారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు లక్షకు పైగా పేద ప్రజలు 'డబుల్'ఇళ్ల కోసం దరఖాస్తు పెట్టుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులులక్ష్మి, నవీన్‌రెడ్డి, కుమార్‌యాదవ్, సురేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పంపిణీ ఏర్పాట్ల పరిశీలన

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గురువారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా చేపట్టనున్న రెండో విడత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే వివేకానంద్ పర్యవేక్షించారు. దుండిగల్‌లోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లో 300 ఇళ్లను పేదలను గుర్తించి అందజేయనున్నామన్నారు. ఇప్పటికే అధికారుల సర్వే పూర్తి చేశారని, అర్హులకు సొంతంటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

అధ్యాపకుల ఆందోళనలను అడ్డుకున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం విధుల బహిష్కరించి పెన్‌డౌన్, చాక్‌డౌన్ నిరసన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు అధ్యాపకుల చేపట్టిన ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం ఓయూ కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ ఆధ్వర్యంలో 12 వర్సిటీల అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. మహిళా వర్సిటీ క్యాంపస్ నుంచి బయటకు వెళ్లేందుకు అధ్యాపకులు యత్నించగా పోలీసులు గేటును మూసి అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన అధ్యాపకులు అక్కడే బైఠాయించి ఉద్యోగాలను పర్మనెంట్ చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

గణపతి బప్పా మోరియా



జీడిమెట్ల పారిశ్రామికవాడ ఫేజ్-3లోని గ్రాన్యూయెల్స్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌లో..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వినాయక చవితి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. బస్తీలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల్లో వినాయకుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. స్థానికులంతా సాయంత్రం మండపాల వద్దకు చేరుకుని విఘ్నేశ్వరుడి సేవలో తరిస్తున్నారు. వివిధ రకాల వంటకాలతో గణపతికి నైవేద్యం సమర్పిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మండపాల వద్దకు వచ్చి వినాయకులను దర్శించుకుంటున్నారు. – కుత్బుల్లాపూర్



పద్మానగర్ ఫేజ్-1, గాయత్రి అపార్ట్‌మెంట్‌లో..



మీనాక్షి కాలనీలోని వినాయక మండపం వద్ద..



సూరారం నార్త్‌సిటీ హైస్కూల్‌లో గణనాథుడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు



జైరామ్‌నగర్‌లోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజలో భక్తులు



దూలపల్లిలోని అశోక-ఎలా-మైసన్‌లో బీజేపీ నేత మల్లారెడ్డి

ఫ్లెక్సీలు కడుతుండగా విద్యుదాఘాతం

- నలుగురు కూలీలకు తీవ్ర గాయాలు
- ప్రాణాపాయం తప్పిందని వెల్లడించిన వైద్యులు
- మెరుగైన చికిత్స అందించాలని బంధువుల డిమాండ్
- జీడిమెట్ల పీఎస్ పరిధిలోని చింతల్‌లో సంఘటన



విఠల్



దుర్గేష్



బాలరాజు



నగేష్

జీడిమెట్ల: బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీ కడుతుండగా నలుగురు కూలీలు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలోని చింతల్ బస్టాప్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్, బాధితుల బంధువుల వివరాల ప్రకారం.. గురువారం దుండిగల్‌లో డబుల్ బెడ్‌రూమ్‌ల పంపకం కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథిగా రానున్నారు. స్వాగత ఏర్పాట్లలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు రోడ్డుకు ఇరువైపుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయిస్తున్నారు. కాగా ఫ్లెక్సీ ప్రింటింగ్ కోసం ఓ షాపు యజమానికి ఆర్డర్ ఇచ్చారు. అతను మరో వ్యక్తికి ఫ్లెక్సీలు కట్టే పనిని కాంట్రాక్ట్ ఇచ్చాడు.

◆ కాంట్రాక్ట్ తీసుకున్న సదరు వ్యక్తి ఐడీపీఎల్‌లో ఉండే మెదక్ జిల్లా పెద్దశంకరంపేట్ రామోజీపల్లికి చెందిన దుర్గేష్(18), మెహిదీపట్నం తాళ్లగడ్డలోఉండే మహారాష్ట్ర చలగామాకు చెందిన నగేష్(23), తాళ్లగడ్డలో ఉండే మెదక్ జిల్లా నారాయణఖేడ్ మండలం నాగధారకు చెందిన బాల్‌రాజు(18), కామారెడ్డికి చెందిన విఠల్(19)లను కూలీలుగా తీసుకువచ్చి ఫ్లెక్సీలు కట్టిస్తున్నాడు.

◆ ఈ క్రమంలో పెద్ద రౌండ్ ఫ్లెక్సీని నలుగురు కలిసి పైకి లేపుతుండగా ప్రమదవశాత్తు ఫ్లెక్సీ కరెంటు తీగలకు తగిలి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటి కూలీలు వారిని సమీపంలోని ఆర్ఎస్‌సీ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. నలుగురి ఆరోగ్యం నిలకడగానే ఉందని ప్రాణాపాయం తప్పిందని వైద్యులు వెల్లడించారు.

◆ విషయం తెలుసుకున్న నలుగురు కుటుంబ సభ్యులు బంధువులు పెద్ద ఎత్తున చింతల్‌లోని ఆర్ఎస్ఎస్ ఆస్పత్రికి చేరుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వారు డిమాండ్ చేశారు. చికిత్స అందించేందుకు కాంట్రాక్టర్ ముందుకొచ్చారు. బాధితులకు నష్ట పరిహారం సైతం అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆస్పత్రికి జీడిమెట్ల సీఐ పవన్ చేరుకుని బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల తరపున ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పేద విద్యార్థులకు స్టడీ కిట్ల పంపిణీ



ప్రగతినగర్ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

నిజాంపేట్: పేద విద్యార్థులకు కేకేఎం ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకుడు కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కేకేఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, గొడుగు, గడియారంతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుల్లో రాణించాలని, వారికి ఏ విధమైన సహాయం కావాలన్నా తమ ట్రస్ట్ సమకూర్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యనభ్యసించిన అనేక మంది నేడు ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు కొల్లి మాధవి, బుచ్చిరెడ్డి, ఆకుల సతీష్, డా.రాజు, దాసి నాగరాజు, ప్రొఫెసర్ చంద్రమౌళి, రామ్ చందర్ నాయక్ అమలేశ్వరి, కొంకి రాము, సాయికృష్ణారెడ్డి, సుహాసిని, ఈశ్వర్‌రెడ్డి, అశోక్ నాయక్, తైనీసా, అఖిల, ట్రస్ట్ వలంటీర్లు తదితరులు ఉన్నారు.

రంగానగర్ అభివృద్ధి పనులపై ప్రత్యేక చర్చ

చింతల్: చింతల్ డివిజన్ రంగానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగానగర్ కాలనీలో జరగబోయే అభివృద్ధి పనులపై ప్రత్యేక చర్చ కార్యక్రమం నిర్వహించారు. కాలనీ అభివృద్ధి కొరకు అసోసియేషన్ సభ్యులతో పాటు ప్రజలందరి నిర్ణయాల మేరకు నడుచుకుంటామన్నారు. అధ్యక్షుడు బండారు వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి జున్ను లక్ష్మణరావు, అడ్వైజర్లు కడియం అనంతరావు, వీర్ల సుబ్బారావు, ఆలే ఎల్లప్ప, ఉపాధ్యక్షుడు మాధవ రాంప్రసాద్, సంయుక్త కార్యదర్శులు అముల సతీష్ కుమార్, కాట సతీష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు పాల్గొన్నారు.

'బురదలో కూరుకుపోయింది'



శ్రీరామ్‌నగర్‌లో కూరుకుపోయిన టిప్పర్ టైర్లు

సుభాష్‌నగర్: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా సమస్య ఉన్న చోట చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. ఇంటి నిర్మాణ నిమిత్తం భారీ వాహనాలు కాలనీలో వచ్చే క్రమంలో బురదలో కురుకపోతున్నాయి. సూరారం డివిజన్ శ్రీరామ్ నగర్‌లో బుధవారం టిప్పర్ రోడ్డు మధ్యలో కూరుకపోవడంతో అటుగా వెళ్లే వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మెరుగైన పరిపాలన అందించేందుకు కృషి



సమస్యలు వింటున్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్ కార్యాలయంలో ఎమ్మెల్సీని కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేయగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శంభీపూర్‌రాజు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా దూసుకుపోతోందన్నారు. అదే విధంగా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదానాలు, పూజల్లో పాల్గొనాలని కోరుతూ ప్రభుత్వ విప్‌కు ఆహ్వానాలు అందజేశారు.

◆ యాదాద్రి లక్ష్మీనర్సింహ స్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు బుధవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు ఆయనకు స్వాగతం పలికి స్వామి వారి దర్శన అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు. కార్పొరేటర్లు రావుల శేషగిరి, జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గుడాల భాస్కర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా చూడాలి



నిజాంపేట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: ప్రజలకు ఉపయోగ పడే విధంగా పార్కు స్థలాన్ని అభివృద్ధి పరిచి ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలని బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ... ప్రగతినగర్‌లోని సర్వే నం.180లో వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారన్నారు. పక్కనే పార్కుకు స్థలం కేటాయించగా ఇటీవల కొంత మంది సదరు స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని అన్నారు. కబ్జా చెరలో చిక్కుకున్న 450 గజాల పార్కు స్థలాన్ని పరిరక్షించి ప్రజాపయోగార్థం మొక్కలు నాటాలని కోరారు.

చింతల్ డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

చింతల్: చింతల్ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్, రంగానగర్, దుర్గయ్య నగర్, దోభీఘాట్, శివానగర్‌లకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం బుధవారం భగత్‌సింగ్‌నగర్‌లో నిర్వహించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ బూత్ కమిటీల ఏర్పాటుతో పాటు త్వరలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఎమ్మెల్యే వివేకానంద్‌ను మూడోసారి గెలిపించుకునేందుకు ప్రజల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో డివిజన్ సమన్వయకర్తలుగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మక్బుద్ అలీ, బసవరాజు, వెంకటేష్, శేఖర్‌రావు, వహీద్ ఖురేషీ, కృష్ణమూర్తి, కర్నెకంటి మల్లేష్, మెహరున్నిసా బేగంలు వ్యవహరించారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సామ్రాట్, నాయకులు హనుమంతరావు, వెంకటేష్ వరప్రసాద్, శ్రీశైలం, సోమశేఖర్, వీరయ్య, పురుశోత్తం, జెల్లా వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించండి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడ నుంచి సూరారం డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్ వెళ్లే దారిలో కృష్ణ మహాలక్ష్మినగర్ రోడ్డుకిరువైపులా చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో దుర్వాసన రావడం వలన అటుగా వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించాలని కోరుతున్నారు.



కృష్ణ మహాలక్ష్మినగర్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో 232 మంది లబ్ధిదారులకు రూ.2,32,26,912 విలువ చేసే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలన్నారు.

◆ కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి మహేంద్ర నగర్, కాకతీయ నగర్‌లలో మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రగతియాత్ర చేపట్టారు. ప్రతికాలనీ, బస్తీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం కాలనీలోని గణేష్ మండపం వద్ద పూజలు చేశారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- రెండు నెలల్లో 8 దొంగతనాలు
- గతంలో 17 చోరీలు చేసి జైలుకి



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ శబరీష్

కుత్బుల్లాపూర్: దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను అల్వాల్ పోలీసులు పట్టుకున్నారు. ఒకవైపు బొల్లారం.. మరోవైపు అల్వాల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏకంగా రెండు నెలల వ్యవధిలో ఎనిమిది దొంగతనాలు చేసి పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన సదరు దొంగను ఎట్టకేలకు పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న 27 తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి, 1.30 లక్షల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ డీసీపీ శబరీష్, సీఐ ఉపేందర్‌రావు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కుమార్ బుధవారం మేడ్చల్ డీసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుడి వివరాలు వెల్లడించారు.

◆ కర్ణాటక రాష్ట్రానికి చెందిన గులాబ్ గంగారాం చౌహాన్ (34) గుల్బర్గా ప్రాంతంలో ఉంటూ ఏకంగా ఆ రాష్ట్రంలో 17 దొంగతనాలు చేసి జైలుకు వెళ్లొచ్చాడు. అక్కడ పోలీసుల నిఘా ఎక్కువగా ఉండడంతో రెండు నెలల క్రితం అల్వాల్ మచ్చ బొల్లారం ప్రాంతానికి వచ్చి ఉంటూ ఒక్కడే ఉదయం ఇంట్లో నుంచి బయలుదేరి తాళం వేసి ఉన్న ఇంటిని కొల్లగొట్టడం అనంతరం విలువైన వస్తువులను దొంగలించడం చేస్తూ వచ్చాడు. ఇలా ఏకంగా రెండు నెలల వ్యవధిలో బొల్లారం, అల్వాల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎనిమిది దొంగతనాలు వరుసగా చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేశారు.

◆ అప్రమత్తమైన జంట పోలీస్ స్టేషన్లో సిబ్బంది సదరు వ్యక్తి కదలికలు, ఇతరత్రా పోలికలను ఆధారం చేసుకొని సీసీ కెమెరాల ఆధారంగా అనుమానంగా ఉన్న అడ్డాలపై దాడులు చేశారు. ఈ క్రమంలో పక్కా సమాచారంతో ఎట్టకేలకు నిందితుడు దొరకడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అతడి నుంచి సుమారు 17 లక్షల 85వేల విలువచేసే నగదు నగలను స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించారు.

◆ నిందితుడిని పట్టుకునే విషయంలో సీఐ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ తో పాటు సిబ్బంది బీతప్ప, గౌస్ పాషా, రమాకాంత్, రాజశేఖర్ లను డీసీపీ శబరీష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ అంతర్రాష్ట్ర దొంగ విషయంలో పీడీ యాక్ట్ ప్రయోగం చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

చెత్త పేరుకుపాయె.. ఎంత చెప్పినా తీయకపాయె!



రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు



నిజాంపేట్: రోజుల తరబడి పేరుకుపోతున్న వ్యర్థాలతో ఆ ప్రాంత వాసులు ఎక్కడ వ్యాధుల బారిన పడతామోనని ఆందోళన చెందుతున్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలోని శ్రీఎన్‌క్లేవ్ కమాన్ సమీపంలోని నర్సరీ వద్ద రోడ్డుపై గత నాలుగు సంత్సరాలుగా చెత్త వ్యర్థాల డంపింగ్ కొనసాగుతోంది. ఈ విషయమై స్థానిక కాలనీల వాసులు పలుమార్లు అధికారులకు చెత్తను వేయకుండా కట్టడి చేయాలని ఎన్నిమార్లు వినతి పత్రాలు అందజేసినా సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఫిర్యాదు చేసిన సమయంలో అధికారులు చెత్తను తొలగించడం, ఆ మరునాడే మరలా కుప్పలుగా చెత్త పేరుకుపోవడం పరిపాటిగా మారింది. అసలే వర్షాకాలం చెత్త వ్యర్థాలతో దోమల బెడద పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. డెంగీ, మలేరియా బారిన పడతామోనని ఆందోళన చెందుతున్నారు.

సమీపంలోనే కళాశాల..

చెత్త డంప్ చేస్తున్న ప్రదేశానికి సమీపంలోనే శ్రీచైతన్య కళాశాల కొనసాగుతోంది. దీంతో కళాశాలకు వచ్చిపోయే విద్యార్థులతో పాటు అటుగా రాకపోకలు సాగించే ప్రజలు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. కళాశాల సమీపంలోనే చెత్త పేరుకుపోవడంతో విద్యార్థులు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఇందిరమ్మకాలనీ ప్రజలకు ప్రత్యామ్నాయం చూపాలి..

నిజాంపేట్ ఇందిరమ్మ కాలనీ తదితర బస్తీల ప్రజలు స్థానికంగా చెత్త వేస్తున్నారని వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే ఇక్కడ చెత్త వేయకుండా కట్టడి చేయవచ్చని ఆయా కాలనీల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



నిజాంపేట్‌లోని శ్రీఎన్‌క్లేవ్ కమాన్ రోడ్డులో నర్సరీ సమీపంలో దుర్గంధమయం

వ్యాధులు ప్రబలే అవకాశం



రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో పాటు ఇటీవల కురుస్తున్న వర్షాలతో స్థానికంగా దుర్గంధ భరిత వాతావరణం నెలకొంటోంది. దీంతో దోమల విపరీతంగా పెరిగిపోయాయి. సమీప కాలనీలు, బస్తీల ప్రజలకు డెంగీ, మలేరియా జర్వాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త వేయకుండా చర్యలు తీసుకుని, స్థానికంగా ఫాగింగ్ చేయించి, బ్లీచింగ్ చల్లించాలి. – రామారావు, వెంకటరాయనగర్ మాజీ అధ్యక్షుడు